1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152



Good for Health
Best for Readers
THE POWER OF RK PEN



సంపుటి : 3 సంచిక : 114 | గురువారం 30 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## కష్టపడితే సాధారణ కార్యకర్తకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు: నారా లోకేశ్

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు
కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు వెచ్చించినట్లు వెల్లడి
వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు పెరిగాయన్న మంత్రి
వైసీపీ పాలనను విధ్వంసంతో పోలిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయని కార్యకర్తల కష్టం వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వారి సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ తెలుగువారికి గుర్తింపునిస్తే, చంద్రబాబు ఈ జాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. మంగళగిరిలో జరిగిన తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.


**అందరం కలిసే ముందుకు..**
పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు పెరిగాయని లోకేశ్ అన్నారు. కానీ, తనలో ఏమాత్రం అహంకారం లేదని పేర్కొన్నారు. 'యువగళం' పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూశానని, అందరినీ కలుపుకొని ముందుకెళతానని చెప్పారు. మహానాడులో తీసుకున్న ఆరు కీలక నిర్ణయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తల పనితీరును గమనించేందుకే 'మై టీడీపీ' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కష్టపడితే సాధారణ కార్యకర్తకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు దక్కుతుందని భరోసా ఇచ్చారు.

**అబద్ధాలపై సమరం**
వైసీపీ పాలనను 'విధ్వంసం'తో పోల్చిన లోకేశ్, తమ లక్ష్యం కేవలం 'అభివృద్ధి' అని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ప్రచారం చేసే అసత్యాలను తిప్పికొట్టాలని ▶మిగతా 2లో

## డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు అందించే ప్రతీ సేవను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిగా ఆన్‌లైన్‌లో



అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకువస్తే, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నాడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) పనితీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నాలజీని ప్రభుత్వ పాలనలో విరివిగా వినియోగించుకోవడంపై ▶మిగతా 2లో

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే..
జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 29)



ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ▶మిగతా 2లో

# పదవి వచ్చిందనే అహంకారం వద్దు


మంగళగిరిలో టీడీపీ నూతన కార్యవర్గానికి శిక్షణ తరగతులు
నాయకుల పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష ఉంటుందని లోకేష్ స్పష్టీకరణ
అందరినీ కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
పదవి వచ్చిందనే అహంకారం వద్దని, అందరినీ కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులకు స్పష్టం చేశారు. నాయకుల పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష ఉంటుందని, పనితీరు ఆధారంగానే గుర్తింపు లభిస్తుందని ఆయన తేల్చిచెప్పారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మిమ్మల్ని నాయకత్వం ఎలా గుర్తించిందో, మీరు కూడా నాయకత్వాన్ని అలాగే గుర్తించాలి. నిన్నటి వరకు వేరు, ఈ రోజు నుంచి వేరు. మీరు చేసే ప్రతి పని పార్టీకి వర్తిస్తుంది. మీరు మంచి చేస్తే పార్టీకి మంచి జరుగుతుంది" అని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో నాయకులు అందరితో కలిసి పనిచేయాలని లోకేష్ సూచించారు. పార్టీ నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కోరారు. అంతకుముందు, కొత్తగా నియమితులైన సభ్యుల కోసం నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను ఆయన ఆసక్తిగా విన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆర్టీఈ కింద స్థానిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాల్సిందే



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రభుత్వాలు సూచించిన విద్యార్థులకు స్థానిక పాఠశాలల్లో జాప్యం లేకుండా ప్రవేశాలు కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది జాతీయ కర్తవ్యమని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిన బాధ్యత ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్థానిక పాఠశాలలకు ఉంటుందని తెలిపింది. ప్రభుత్వం సూచించిన విద్యార్థులకు ప్రవేశాలను ▶మిగతా 2లో

## యుద్ధంలో చిక్కుకుపోయాం.. డాలర్లతో గట్టెక్కించండి

అమెరికాకు సంపన్న యూఏఈ మొర

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 29)



పశ్చిమాసియా యుద్ధం గల్ఫ్ సహా పలు దేశాల ఆర్థిక వ్యవస్థల్ని కుదిపేస్తోంది. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చమురు సంపన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఇప్పుడు అమెరికా సాయాన్ని కోరుతోంది. ఈ సాయం నగదు, రుణాల రూపంలో కాకుండా.. అమెరికా డాలర్లతో తమ దిర్హామ్‌ల మార్పిడికి ఒప్పందం చేసుకుందామని అడుగుతోంది. గల్ఫ్‌లోని మరికొన్ని అమెరికా మిత్రదేశాలూ ఇదే బాటలో పయనిస్తున్నాయి. మే 1వ తేదీ నుంచి తాము ఒపెక్ దేశాల కూటమి నుంచి బయటికి వస్తామని యూఏఈ మంగళవారం ప్రకటించింది. చమురు మార్కెట్‌లో కల్లోలం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ▶మిగతా 2లో

## ఒపెక్ నుంచి యూఏఈ ఎగ్జిట్.. భారత్‌కు మంచిదే

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 29)



చమురు ఎగుమతి దేశాల సమాఖ్య అయిన ఒపెక్, ఒపెక్‌ం నుంచి నిష్క్రమించనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించడం చర్చనీయాంశం అయ్యింది. దీనివల్ల ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందన్న దానిపై ఆసక్తి నెలకొంది. అయితే, ఒకరకంగా భారత్‌కు కలిసొచ్చే అంశమని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అన్నారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.
ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం గురించి ఇప్పుడే ఓ అంచనాకు రాలేమని సాగర్ అదానీ అన్నారు. ప్రపంచ ఆయిల్ మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటుందా? స్థిరత్వం సాధిస్తుందా? అనే దానికి కాలమే సమాధానం చెప్తుందన్నారు. అదే సమయంలో యూఏఈతో భారత్‌కు ఉన్న మంచి సంబంధాల దృష్ట్యా మనకు లాభించే అవకాశం ఉందన్నారు. ▶మిగతా 2లో

## ఏపీలో ఒకవైపు ఎండలు, మరోవైపు వర్షాలు

ఏపీలో ఎండలు, వర్షాలతో విభిన్న వాతావరణం
10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని హెచ్చరిక
విశాఖ, అనకాపల్లి సహా పలు జిల్లాల్లో
పిడుగులతో కూడిన వర్షాలు
నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
వడదెబ్బ, పిడుగుల బారిన పడకుండా జాగ్రత్తలు అవసరం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది.
వివరాల్లోకి వెళితే, బుధవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 20 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది.
మరోవైపు ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కూడా నమోదవుతున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ▶మిగతా 2లో

## మోదీ 'జనాగ్రహ సభ'.. పోస్టర్ ఆవిష్కరించిన భాజపా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 29)
మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం చేసినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వెల్లడించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు."లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్‌కు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.7 వేల కోట్లకుపైగా నిధులతో ▶మిగతా 2లో

## ఇకమీదట మంచోడిగా ఉండను



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 29)
ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కారం త్వరలో లభించకుంటే అమెరికా కఠిన వైఖరి తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. ఈ మేరకు రైఫిల్ పట్టుకున్న ఫొటోను 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేసిన ట్రంప్.. ఇక మీదట తాను మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు."చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోంది. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిది. 'ఇక మీదట అంత మంచివాడిగా ఉండను' అని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న వేళ ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతేకాదు, అమెరికా ప్రతిపాదనలు తిరస్కరిస్తే తాము మరింత దూకుడుగా, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు.

## మేడే సందర్భంగా సిఐటియు జెండా ఆవిష్కరణలు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 29)

ఉలవపాడు హై స్కూల్ లో బుధవారం సీఐటీయూ ఉలవపాడు మండల కమిటీ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ కు సీఐటీయూ మండల కో- కన్వీనర్ సిహెచ్ ఇందిరావతి అధ్యక్షత వహించింది. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ పాల్గొని మే డే విశిష్టత గురించి మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్రంలో పాలకులు పని గంటలను పెంచి కార్మికులపై తీవ్రమైన పనిభారాన్ని మోపారని అన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం తిరిగి పోరాడాలని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం మే 1న జరిగే మేడే అన్ని యూనియన్ల జండా ఆవిష్కరణ చేసుకొని, ఉదయం 10 గంటలకు ఉలవపాడులోని సింగరాయకొండ ఆటో స్టాండ్‌లో జరిగే సభలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడి, పి టి పి, సిపిఎం నాయకులు జె ప్రవీణ, పి నాగమణి, డి కమల, గంజి శ్రీనువాసులు, జే వెంకటేశ్వర్లు, ఏలూరి నాగార్జునలు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమంగా స్వచ్ఛపదం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)

మండల కేంద్రమైన పొన్నలూరు భారత్ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం ఎంపీడీవో డాక్టర్ పి సుజాత ఆధ్వర్యంలో స్వచ్ఛ పదం కార్యక్రమం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ గ్రామాలు, మండల ప్రధాన కేంద్రాలు, హైవేల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా సంకల్పంతో స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ప్రతి బుధవారం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేసే పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలోమండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మండవ మురళీమోహన్, శేషారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నారాయణ, గీత, డిప్యూటీ ఎంపీడీవో సతీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకొల్లు సిఐగా రామానాయక్ బాధ్యతలు స్వీకరణ




(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, ఏప్రిల్ 29)

ఇంకొల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎం రామానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రమణయ్య ఆ స్థానంలో రామానాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఆయన బాధ్యతలుచేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సిఐకు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

## కష్టపడితే సాధారణ కార్యకర్తకు కూడా పోలిట్ బ్యూరోలో చోటు: నారా లోకేశ్

కార్యకర్తలకు సూచించారు. అహంకారం పెరిగితే ఏమవుతుందో 2024 ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ఎద్దేవా చేశారు. జగన్ పార్టీది కేవలం క్రెడిట్ చోరీ జబ్బు మాత్రమేనని, ఆ పార్టీకి ఎండ్ కార్డ్ వేసే బాధ్యత పసుపు సైన్యానిదేనని ధీమా వ్యక్తం చేశారు.

## మోదీ 'జనాగ్రహ సభ'.. పోస్టర్ ఆవిష్కరించిన భాజపా

చేపట్టిన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అడ్డుకుంది. ఉత్తరాది, దక్షిణాది పేరుతో విభజన రాజకీయాలు చేస్తోంది" అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

## యుద్ధంలో చిక్కుకుపోయాం.. డాలర్లతో గట్టెక్కించండి

ఒపెక్‌లో కొనసాగడం కన్నా కూడా దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం ముఖ్యమని యూఏఈ ఆలోచన చేస్తోంది. దీనివల్ల ఒపెక్ పరిమితుల నుంచి బయటపడొచ్చు...డాలర్లను సమకూర్చుకోవచ్చునేది వ్యూహం. పైపెచ్చు అమెరికా ఆర్థిక, రక్షణ ఛత్రంలోకి వెళ్లొచ్చని అనుకుంటోంది.గల్ఫ్ దేశాలవి చమురు ఆధార ఆర్థిక వ్యవస్థలు. అవి చమురును డాలర్లలో అమ్ముతాయి. డాలర్ మారకం కాబట్టి అమెరికా ఆర్థిక వ్యవస్థకూ లబ్ధి చేకూరుతోంది. అయితే యుద్ధం వల్ల చమురు ఎగుమతుల్లేక తమ డాలర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయని అమెరికాకు యూఏఈ నివేదించింది. ఇప్పటికి 12,000 కోట్ల డాలర్లు కోల్పోయామని తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ వాణిజ్యాన్ని చైనా యువాన్‌లలోకి మళ్లించడం తప్ప మరో మార్గం లేదని యూఏఈ చెబుతోంది. తమకు ఇష్టంలేకపోయినా యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికాయే కాబట్టి.. ఇప్పుడు ఆదుకోవాల్సింది కూడా ట్రంప్ సర్కారేనని వాదిస్తోంది. దీనికి అమెరికా కూడా సానుకూలత వ్యక్తంచేస్తున్నా.. స్పష్టత మాత్రం ఇవ్వట్లేదు. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవాలి కాబట్టి అంగీకరించే అవకాశాలే ఎక్కువ.

**ఏమిటీ కరెన్సీ మార్పిడి?**

ఒక దేశం కరెన్సీని అమెరికా డాలర్‌తో మార్చుకోవడానికి రెండు దేశాల సెంట్రల్ బ్యాంకుల మధ్య కుదిరే ఒప్పందమే కరెన్సీ మార్పిడి. ఇది ఒక రకంగా ఆర్థిక భద్రతాఏర్పాటు. ఉదాహరణకు యూఏఈకి అత్యవసరంగా డాలర్లు అవసరమై.. దిర్హమ్‌లను పంపితే వాటిని అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాత్కాలికంగా డాలర్లలోకి మార్చి ఇస్తుంది. ఆ తర్వాత ముందుస్తు అంగీకార రేటు ప్రకారం వాటిని మళ్లీ రివర్స్ చేస్తారు. ఇక్కడ శాశ్వత బదిలీ, లేదా సాయంలాంటివి ఉండవు. ఇలాంటి మార్పిడి వల్ల డాలర్ల కొరతను తీర్చుకోవచ్చని యూఏఈ భావిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు డాలర్ వెన్నెముకలాంటిది కాబట్టి... అవి తమవద్ద ఉంటే ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని గల్ఫ్ దేశాలు అనుకుంటున్నాయి.

**యూఏఈకి ఎందుకీ సాయం?**

ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న దేశాల్లో ఒకటైన యూఏఈకి అమెరికా సాయం ఎందుకు అవసరం అన్న ప్రశ్న రాక మానదు. ఈయూఏ సంపన్న దేశమే. అయితే అది ఎక్కువగా దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులపై భారీగా పెట్టుబడులు పెట్టింది. ఆ ఆస్తులపై రాత్రికి రాత్రి రాబడులు రావు. మార్కెట్లు సంక్షోభంలో ఉన్నప్పుడు చేతిలో నగదు ఉండదు. తక్షణ అవసరాలకు డబ్బు అవసరం. అందుకే ఈ కరెన్సీ మార్పిడి చర్చలు. దీనిపై అమెరికా ఎలా ముందడుగు వేస్తుందోనని గల్ఫ్ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## ఏపీలో ఒకవైపు ఎండలు, మరోవైపు వర్షాలు

పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది.

ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ సూచించింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది. అదేవిధంగా, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

## ఆర్టీఈ కింద స్థానిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాల్సిందే

నిరాకరించడం రాజ్యాంగంలో నిర్దేశించిన ఉచిత, నిర్బంధ విద్యా హక్కును ఉల్లంఘించడమేనని ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. బలహీన వర్గాలకు చెందిన ఓ చిన్నారికి పూర్వప్రాథమిక తరగతిలో ప్రవేశం కల్పించాలన్న హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ లఖ్‌నవూలోని పబ్లిక్ స్కూల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కొట్టివేస్తూ ఈ తీర్పు వెలువరించింది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన జాబితా ప్రకారం ఆ చిన్నారికి పబ్లిక్ స్కూల్‌ను అధికారులు కేటాయించారు. ఈ ఆదేశాల అమలుకు పాఠశాల యాజమాన్యం నిరాకరించడంతో వివాదం తలెత్తింది.

**మత కార్యకలాపాల పేరుతో రహదారుల దిగ్బంధనం తగదు**

ఇష్ట దైవాన్ని ఆరాధించడం, పూజాక్రతువులు నిర్వహించుకోవడం ఆయా మత విభాగాల ఆచార వ్యవహారాల పరిధిలోకే వస్తుందని, వాటిలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రజల సాధారణ జనజీవనానికి అవరోధం కలిగిస్తే ఆ మత హక్కుల్లో ప్రభుత్వాలు, కోర్టులు జోక్యం చేసుకుంటాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం స్పష్టంచేసింది. శబరిమల ఆలయంతో పాటు ప్రార్థనాస్థలాల్లో మహిళల పట్ల వివక్షపై దాఖలైన వ్యాజ్యాల విచారణ తొమ్మిదో రోజు కూడా కొనసాగింది. 'ఆలయం, ప్రార్థనా మందిరం పరిధిలోని మత కార్యకలాపాలపై అభ్యంతరం ఉండదు. అవే కార్యకలాపాలతో రహదారులను దిగ్బంధించడం, విద్యార్థుల చదువులకు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటాయ'ని జస్టిస్ బి.వి.నాగరత్న స్పష్టం చేశారు.

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

**ప్రాజెక్టు ముఖ్యాంశాలు**

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది.ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

## డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

పలు కీలక నిర్దేశాలు చేశారు. ప్రస్తుతం 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 సేవలను అందిస్తున్నామని, ఈ విధానం ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల మంది పౌరులు 1.78 కోట్ల సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 24 లక్షల మందికి పైగా వాట్సాప్ ద్వారా సేవలు ఎలా పొందాలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ పురోగతిని అభినందించిన ముఖ్యమంత్రి, మిగిలిన అన్ని సేవలను కూడా నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్ వేదికపైకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**శరవేగంగా డ్రోన్ సిటీ.. జూలైకి తొలి దశ పూర్తి చేయాలి**

కర్నూలు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డ్రోన్ సిటీ మొదటి దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఇప్పటికే డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారైందని, ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మే నెల రెండో వారంలో ఈ కంపెనీలు తమ నిర్మాణ పనులను ప్రారంభించనున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, డ్రోన్ సిటీ మొదటి దశ పనులను ఈ ఏడాది జూలై నాటికి కచ్చితంగా పూర్తి చేయాలని గడువు విధించారు. ఇది రాష్ట్రానికి టెక్నాలజీ రంగంలో గర్వకారణంగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

**నేర నియంత్రణ, శాటిలైట్ డేటా వినియోగంపై దృష్టి**

రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణ అత్యుత్తమంగా ఉందని, దీని ఫలితంగా నేరాలను నియంత్రించడం, నేరస్తులను గుర్తించడం, మిస్సింగ్ కేసులు, వాహనాల దొంగతనాల వంటివి వేగంగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ కెమెరాలతో పాటు, సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసుకున్న కెమెరాల డేటాను కూడా ప్రభుత్వ వ్యవస్థతో ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

అదేవిధంగా, శాటిలైట్ డేటాను ఆర్టీజీఎస్‌కు అనుసంధానించి, విపత్తులు లేదా అత్యవసర పరిస్థితులను ముందుగానే పసిగట్టి, వేగంగా స్పందించేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఇటీవల శేషాచల అడవుల్లో జరిగిన అగ్నిప్రమాదాన్ని ప్రస్తావిస్తూ, శాటిలైట్ సమాచారం ఉండి ఉంటే మరింత వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. అలాగే, ఇటీవల తలెత్తిన ఇంధన సరఫరా సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించిందని, అయితే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో గుర్తించి, నివారించే దిశగా సాంకేతికతను వాడుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఒపెక్ నుంచి యూఏఈ ఎగ్జిట్.. భారత్‌కు మంచిదే

భారత్ కోణంలో చూస్తే ఈ పరిణామం వల్ల మేలు జరుగుతుందని, ప్రపంచ మార్కెట్ కోణంలో చూడాల్సివస్తే ఇప్పుడే తుది నిర్ణయానికి రాలేమన్నారు.

**రూపాయిల్లో చెల్లింపులకు అవకాశం**

ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల భవిష్యత్‌లో ప్రపంచ చమురు మార్కెట్‌లోకి క్రూడాయిల్ సరఫరా పెరుగుతుందని కోటక్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ హెడ్ ఆనింద్య బెనర్జీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు మెరుగుపడ్డాక సరఫరా పుంజుకొంటుందని చెప్పారు. అలాగే, భారత్, యూఏఈ మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడనున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చమురు కొనుగోళ్లకు రూపాయిల్లో చెల్లింపుల్లో వేగం పుంజుకొనే అవకాశం ఉందన్నారు. డాలర్లకు బదులుగా భారతీయ రూపాయిల్లో చమురు కొనుగోలు చేసే అవకాశం పెరుగుతుందని బెనర్జీ పేర్కొన్నారు.

## పిఎఫ్ సమస్యల పై డిప్యూటీ సీఈఓ కు వినతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల జడ్పీ పిఎఫ్ సమస్యల పై డిప్యూటీ సీఈఓకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జడ్పిపిఎఫ్ బుక్కులను అప్డేట్ చేయవలసిందిగా, ఉపాధ్యాయులు పెట్టిన లోన్స్ క్లోజరను ఈ ఆఫీసులో పెట్టి వెంటనే మంజూరు చేయాలని కోరామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పిఎఫ్స్ స్లిప్ల వేటపాలెం మండలంలోని ఆరు హైస్కూళ్ళకు, ఇంకొల్లు జడ్పీ హైస్కూల్‌కు ఇంత వరకు స్లిప్పులు రాలేదని తెలియజేశారు. జడ్పీ పిఎఫ్ సిబ్బందిని ఇతర శాఖలకు డిప్యూటేషన్ వేయడం వలన ఉపాధ్యాయుల పిఎఫ్ సర్వీసు అప్డేట్ కాకుండా ఆలస్యం అవుతున్నాయని, అలా కాకుండా చూడాలని కోరారు. పిఎఫ్ సిబ్బంది యొక్క సిస్టమ్స్ తగినంత లేనందువలన రెండు మూడు సెక్షన్లో కలిపి ఒకే సిస్టంలో పని చేయవలసి వస్తుందన్నారు. అందువలన కూడా ఆలస్యం అవుతుందన్నారు. తగిన కంప్యూటర్స్‌ను ఏర్పాటు చేయవలసిందిగా కోరామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పిఎఫ్ స్లిప్పులు త్వరగా పిఎఫ్ షెడ్యూల్ తెప్పించుకొని స్లిప్పులు ఇవ్వవలసిందిగా కోరారు. ఉపాధ్యాయుల పిఎఫ్ లోన్ క్లోజరు ఈ ఆఫీస్‌లో పెట్టి సిటిజన్ చార్ట్‌ను అమలు చేయాలన్నారు. పిఎఫ్ బుక్స్ భద్రతకు సంబంధించి ఇనుప ర్యాక్స్‌లో బయట ఉంచడం వలన వర్షంలో తడవకుండా ఎండలో ఎండకుండా తగిన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ విషయాలపై ఆమె సానుకూలంగా స్పందించారని యుటిఎఫ్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి, జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, సహాధ్యక్షుడు వై వెంకట్రావు, డి ఖాసీం వలి, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు  తెలుగు దినపత్రిక

30.04.26  గురువారం




# పారిశుధ్యంపై స్పెషల్ ఫోకస్

## కొత్తగా వందమంది సిబ్బందిని తీసుకోండి

**క్లీన్ ఒంగోలు ఆవిష్కృతమే లక్ష్యం**
**ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరగాలి**
**సమస్యలు తెలిపేందుకు టోల్ ఫ్రీ నెంబర్**
**ప్రత్యేక స్క్వాడ్ తో శానిటేషన్ పరిశీలన**
**5 నెలల పాటు ఒంగోలు మున్సిపాలిటీ**
**ఆవిర్భావ వేడుకల నిర్వహణ**
**అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం**
**కార్పొరేషన్ విధులపై ప్రత్యేక సమీక్ష**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 29)**

ఒంగోలులో పారిశుధ్య నిర్వహణ అత్యధిక ప్రాధాన్యత అంశమని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా అవసరమైన సిబ్బందిని భర్తీ చేసుకొని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. బుధవారం ఒంగోలు కార్పొరేషన్ లో సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్యము, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు.



పారిశుధ్య నిర్వహణకు అవసరమైన స్థాయిలో సిబ్బంది లేరని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ కొత్తగా 100 మంది పురుషులను తాత్కాలిక ప్రాతిపదికన పారిశుధ్య విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు. రెండు నెలల పాటు వారి పనితీరును పరిశీలించిన అనంతరం ' కోవిడ్ ' కేటగిరీలోకి మార్చాలని ఆదేశించారు. పారిశుధ్యం సరిగ్గా లేదని ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సంతృప్తికర స్థాయిలో సిబ్బంది విధులు నిర్వహించేలా పర్యవేక్షించాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికార యంత్రాంగం దృష్టికి తెచ్చాలా కార్పొరేషన్ లో ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ కూడా త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణపరంగా వివిధ ప్రాంతాలను ఏ, బి, సి కేటగిరీలుగా గుర్తించి, సి కేటగిరి ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది సరిగ్గా విధులు నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించి, అధికారుల దృష్టికి తెచ్చేలా ప్రతి డివిజన్లో ఒక సీనియర్ సిటిజన్ ను అంబాసిడర్ గా ఉంచాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, బహిరంగ ప్రదేశాలలో అనధికారికంగా వ్యర్థాలను పడవేయకుండా పర్యవేక్షించేందుకు సీసీటీవీలు, లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. హోటల్స్ నుంచి వచ్చే తడి చెత్తను నేరుగా డంపింగ్ యార్డ్ కు తరలించేందుకు అవసరమైన వాహనము, కాంపాక్టును వారి నుంచే సమకూరేలా హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. పారిశుధ్య (తరువాయి 4లో...)

# 180 గ్రాముల బంగారం చోరీ

## రూ.25 లక్షలు పైగా విలువ





**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 29)**

ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఓ రైతు ఇంట్లో భారీ చోరీ జరిగింది. పెద్దారవీడు ఎస్ఐ సైదు బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేవరాజుగట్టు గ్రామం రోడ్డులోని ఆనెకాల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 28న ఆరోగ్యం బాగోలేక గుంటూరులోని ఓ ఆసుపత్రికి కుటుంబ సభ్యులందరూ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. హాస్పిటల్‌లో చూపించుకుని అక్కడే ఉన్నారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేనిది గమనించిన దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. హాస్పిటల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండటం చూసి విస్తుపోయారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు, (తరువాయి 4లో...)

# డీజిల్ కొరత వైసిపి పై రుద్దటం సిగ్గు సిగ్గు

**కూటమి ప్రభుత్వ దుష్ప్రచారాలను తిప్పికొడతా**
**విశాఖలో గూగుల్ డేటా సెంటర్ కు భూములు ఇచ్చింది జగన్**
**పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తుంటే**
**ఎకరా రూ.99 పైసలకే ప్రభుత్వ భూములు ఎందుకు ఇవ్వాలి**
**కేంద్ర ప్రభుత్వ అండదండలతోనే రాష్ట్రానికి పరిశ్రమలు**
**స్థానిక సంస్థల ఎన్నికలలో మాదే విజయం**
**రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 29)**

దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ఏటువంటి ఆటంకాలు లేకుండా వినియోగదారులకు దొరుకుతుంటే, రాష్ట్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా పెట్రోల్, డీజిల్ బంకులు వద్ద గత మూడు రోజులుగా వాహనాలు బారులు తీరి ఉండటం కూటమి ప్రభుత్వ అసమర్ధ పాలనకు నిదర్శనమని రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి విమర్శించారు. ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొడతాను కూడా వైసీపీ పై నింద వేయడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. పెట్రోల్ బంకుల వద్ద వాహనాలను వైసీపీ నాయకులు తెచ్చిపెట్టారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గూగుల్ డేటా సెంటర్ కోసం అదానీతో ఒప్పందం కుదుర్చుకున్నారని గుర్తు చేశారు. వైసిపి హయాంలో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వచ్చాయన్నారు. చిన్న, మధ్యస్థ పరిశ్రమలు ఎవరి హయాంలో ఎక్కువగా వచ్చాయో, ఎవరి హయాంలో ఎక్కువగా నిలిచిపోయాయి ఒక్కసారి లెక్కలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైసీపీ పై దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదురుకోవడానికి వైసిపి అన్ని విధాల సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# స్వచ్ఛ పథం కార్యక్రమంతో గ్రామాల రూపురేఖల్ని మార్చండి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 29)**

స్వచ్ఛ పథం కార్యక్రమం ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం 'స్వచ్ఛ పథం' కార్యక్రమం అమలు పోస్టర్‌ను పంచాయతీరాజ్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించి రోడ్లను



ఆకర్షణీయంగా ఉంచాలన్నారు. ఇప్పటినుంచి ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. పంచాయితీ అభివృద్ధి అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించి 'పీ ఆర్ వన్ యాప్' లో కార్యక్రమం వివరాలు అప్లోడ్ చేయాలని వివరించారు.

4

# తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు జిల్లా నేతల అభినందనలు



4

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 29)**

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం మంగళగిరిలో అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్,

# వేటపాలెంలో భార్యాభర్తలు ఆత్మహత్య

**అనాధగా మిగిలిన 13 నెలల పసికందు**
**స్థానికుల కన్నీటి పర్యంతరం - నివ్వెర పోయిన వేటపాలెం**

**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 29)**

మండలంలోని రావూరుపేట ఆర్యవైశ్య వీధిలో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనంగా మారింది. బుధవారం మధ్యాహ్నం మాజేటి ప్రభాకర్ (33), పార్వతి (24) ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలు పార్వతి మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ప్రక్క ఇంటి వాళ్లకు పాపను చూడమని అప్పగించినట్లు చెబుతున్నారు. మృతుడు ప్రభాకర్ ఎంబీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడానికి ముందు ప్రభాకర్ అతని సోదరుని మీసేవ కేంద్రానికి వెళ్లి వచ్చినట్లుగా చెబుతున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సోదరుడు సుధాకర్ ఇంటికి వచ్చిన సమయంలో ఒకరు బాత్రూంలో, మరొకరు బెడ్ రూమ్‌లో చీరతో ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి బంధువులకు చెప్పడంతో విషయం





4

## తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు జిల్లా నేతల అభినందనలు

డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, బి ఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు, మాజీ డైరీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తదితరులు నారా లోకేష్‌ను శాలువాలు, బొకేలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## వేటపాలెంలో భార్యాభర్తలు ఆత్మహత్య

బహిర్గతమైంది. సమాచారం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు మృతదేహాలను చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రుల ఊసే తెలియని 13 నెలల పసిపాప మాన్విత అదమరిచి నిద్రపోతున్న దృశ్యం స్థానికులను కలచివేసింది. ఈ నెల 5వ తేదీన మాన్విత మొదటి పుట్టినరోజు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. భార్యాభర్తల మరణానికి కారణాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

## స్వచ్ఛ పథం కార్యక్రమంతో గ్రామాల రూపురేఖల్ని మార్చండి

ఎంపీడీవోలు పర్యవేక్షణ చేసి ఉన్నతాధికారులకు పురోగతి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం సమర్ధవంతంగా అమలయ్యేలా జిల్లా మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డిఎల్‌డిఓ బాలు నాయక్, పెద్దారవీడు డిప్యూటీ ఎంపిడిఓ వి శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 180 గ్రాముల బంగారం చోరీ

తదితర సామగ్రి చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన సుమారు రూ.25 నుంచి రూ.27 లక్షల విలువ గల 180 గ్రాముల బంగారం, కొంత వెండి, కొంత నగదు దుండగులు అపహరించారని గుర్తించారు. దీంతో వెంకటేశ్వరరెడ్డి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సైదుబాబు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనను పరిశీలించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## సివిల్ సప్లయ్స్ రాష్ట్ర అధికారులను సత్కరించిన రాష్ట్ర ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్





**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఏప్రిల్ 29)**

సివిల్ సప్లయ్స్ కమిషనర్ కన్నబాబు, డైరక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్‌లను బుధవారం ఏపి రాష్ట్ర ఎల్‌పిజి డిస్టిబ్యూటర్స్ అసోసియేషన్ తరుపున ఐఓసిఎల్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీ శ్రీనాథ్‌రెడ్డి, రామ్‌కుమార్, ఉపాధ్యక్షులు సుధీర్ పుజారి, సెంట్రల్ ఆంధ్ర జాయింట్ సెక్రటరీ త్రిమూర్తి రాజు, శ్రీనివాస అగ్రిరిపల్లిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సంక్షోభ సమయంలో గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్స్ అందించిన సేవల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓటిపిల ద్వారా డెలివరీ విధానం పై అనుకున్న దానికంటే మెరుగ్గా రాణించడంతో ప్రభుత్వం పై ఒత్తిడి తగ్గిందని వారు అసోసియేషన్ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఓటిపి విధానం పై అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఓటిపి డెలివరీ విధానమే కాకుండా ఆటోమేటిక్ సిలిండర్ సీరియల్ నెంబర్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెస్తే సిలిండర్ల సరఫరాలో బ్లాక్ మార్కెటింగ్ పూర్తిగా కంట్రోల్ అవుతుందని ఆ మేరకు ఆయిల్ కంపెనీల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయించండని అధికారులకు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆయిల్ కంపెనీల అధికారులకు గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా సమృద్ధిగా ఉండేలా సూచించాలని, కమర్షియల్ సిలిండర్ల సరఫరాను పెంచాలని వినతిపత్రం సమర్పించారు.



## పారిశుధ్యంపై స్పెషల్ ఫోకస్
## కొత్తగా వందమంది సిబ్బందిని తీసుకోండి

నిర్వహణ తీరును పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందితో స్క్వాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. శానిటేషన్ సెక్రటరీ, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇద్దరి నుంచి వచ్చిన హాజరును ప్రామాణికంగా తీసుకుని పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరగటమే లక్ష్యంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

**అట్టహాసంగా ఆవిర్భావ వేడుకలు**

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు అయినందున మే ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు ఐదు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీటిలో ప్రజలను భాగస్వాములను చేయడంతో పాటు ఒంగోలు నగరాన్ని సుందరంగా ఉంచటంలో వారు కూడా బాధ్యతగా ఉండేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు ఉండాలన్నారు.

**వినియోగంలోకి కంట్రోల్ రూమ్**

కార్పొరేషన్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమును కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కేంద్రంలోని సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ పట్టాభి సీతారామ స్వాములవారి శతాబ్ది కళ్యాణ మహోత్సవాలు




**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 29)**

మండలంలోని మీర్జాపేట గ్రామంలో మే 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు శ్రీ పట్టాభి సీతారామ స్వాములవారి శతాబ్ది కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడతాయని గ్రామ పెద్దలు పాత్రికేయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1వ తేదీ ఉదయం 8 గంటల నుండి గణపతి పూజ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, తీర్థ ప్రసాదముల వినియోగం, సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ వాస్తవ్యులు కందుకూరి సుబ్రహ్మణ్యచారి వారి ధర్మపత్ని ఈశ్వరమ్మ కుమారుడు కందుకూరి రమేష్ ఆచార్యులు వారి ధర్మపత్ని బాలా మణి వారి కుమారుడు నీలకంఠాచార్యులచే శ్రీ పట్టాభి సీతారాముల స్వాముల మూల విరాట్‌కు వెండి కిరీటములు సమర్పించే దాతల కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటల నుండి వేద పండితులైన బ్రహ్మర్షి ఆమంచి యల్లమంచేశ్వరశర్మ, బ్రహ్మర్షి సంగం బొట్ల వెంకట సత్య వరప్రసాద్ శర్మ, బ్రహ్మర్షి విట్టపు వెంకట రమణయ్య శర్మ, స్థానిక గ్రామ పురోహితులు, బ్రహ్మర్షి ఓరుగంటి శ్రీరామ్ శర్మ వార్లచే శ్రీ పట్టాభి సీతారామ స్వాములవారి కళ్యాణ మహోత్సవం వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించబడుతుందన్నారు. రాత్రి 9 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అనంతరం 11 గంటల నుండి అశ్వ వాహన గ్రామోత్సవం నిర్వహించబడును. మే 2వ తేదీన ఉదయం 8 గంటల నుండి పూజా కార్యక్రమాలు, నివేదన, మంగళ హారతులు, తీర్థ ప్రసాదాల వినియోగం. రాత్రి 7 గంటల నుండి శ్రీ హనుమంత వాహన గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు శ్రీ భ్రమరాంబ నాట్య కళామండలి వారిచే భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించబడును. మే 3వ తేదీ రాత్రి గరుడవాహనం, గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు మారుతి మహిళా సంఘం, మార్కాపురం వారిచే కోలాటం ప్రదర్శించబడుతుందన్నారు. మే 4వ తేదీ రాత్రి 7 గంటలకు గజ వాహనం, గ్రామోత్సవం, మే 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ నటరాజ్ తీన్మార్, డప్పుల బృందం నరసరావుపేట వారిచే నృత్య ప్రదర్శన, సాయంత్రం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమం, మే 6వ తేదీన వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. కావున యావన్మంది భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని నిర్వాహకులు కోరారు.

## చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు పనిచేయాలి

### మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 29)**

చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యంగా జిల్లాలోని మున్సిపల్ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లాలోని మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో విభజించి చేయు ప్రక్రియలో భాగంగా జూన్ 26 వ తేది లోపు ఇంటింటి చెత్త సేకరణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చెత్త నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని వారం రోజుల్లో గుర్తించాలని పొదిలి నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్థలాలను గుర్తించిన మిగతా మున్సిపాలిటీల్లో మే నెలాఖరులోపు పనులు చేపట్టాలని తెలిపారు. రానున్న మూడు నెలల్లో స్వచ్ఛ మార్కాపురం జిల్లా గా తీర్చిదిద్దేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలసి అధికారులు పనిచేయాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి, పొదిలి మున్సిపల్ కమిషనర్లు నారాయణరావు, శ్రీధర్, మారుతిరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మేదరమెట్లలో స్వచ్ఛ పథం కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 29)**

మండలంలోని మెదరమెట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న డివైడర్‌ల వద్ద శానిటేషన్ చేపట్టారు. డివైడర్ మధ్యలో ఉన్న పిచ్చి చెట్లు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సెక్రటరీ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఎండిఓ రాజ్యలక్ష్మి నేతృత్వంలో స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేయించడం జరిగిందన్నారు. స్వచ్ఛ గ్రామాలతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని లక్ష్మీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# ఆవాజ్ రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయండి



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 29)**

బద్వేల్ పట్టణం నందు ఆవాజ్ కమిటీ కార్యాలయం నందు బుధవారం ఆవాజ్ రాష్ట్ర 3వ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష మాట్లాడుతూ ఆవాజ్ రాష్ట్ర 3వ మహాసభలు నెల్లూరు నగరం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మే 9, 10 తేదీలలో జరగనున్నాయన్నారు. ఆవాజ్ కమిటీ ఏర్పడి నేటికీ 23 సంవత్సరాలు అయినది ఆవాజ్ కమిటీ ముస్లిం మైనార్టీల హక్కుల కోసం, మతసామరస్యం కోసం ఇతరుల హక్కుల కోసం అభివృద్ధి, భద్రత, లౌకిక తత్వం అనే ఆశయంతో నిరంతరం పనిచేస్తుంది, మైనార్టీల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన రంగనాథ్ మిశ్రా కమిషన్, రాజేంద్ర సచార్, కమిటీ సిఫారసు అమలు కోసం ఆవాజ్ అనేక పోరాటాలు చేసింది. మైనార్టీలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు కోతకు గురవుతున్నాయి. ముస్లిం, మైనార్టీలకు సమస్యలు పరిష్కారానికై పోరాటాలు నిర్వహించేందుకు సమయత్వం అవుతుంది. ఈ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా ప్రధాన వక్తలుగా మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె చంద్రు, ఆవాజ్ వ్యవస్థాపకులు , కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, మాజీ ఎమ్మెల్సీ వి సుబ్రహ్మణ్యం, ఏపి వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, నర్రా శ్రీనివాసరావు హైకోర్టు న్యాయవాది, వి ఉమామహేశ్వరరావు, ఎస్ అంకయ్య, మహమ్మద్ అబ్దుల్లా, ఎస్ అబ్దుల్ సుభాన్, రాష్ట్ర నలుమూలల నుండి ముఖ్య నాయకులు మహాసభల్లో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు.


# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన కందుల వసంతలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 29)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి బుధవారం మార్కాపురం పట్టణం, మండలంలోని 13 మందికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ.4,09,237, సయ్యద్ హసీనా రూ.30,500, షేక్ మాబున్ని రూ.31,278, నూనె వెంకట సత్య శివారెడ్డి రూ.43,077, బొందిలి రామ్ ప్రసాద్ సింగ్ రూ.25,437, గోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి రూ.25,437, కంచర్ల కిరణ్ రూ.40,000, పిట్టు హేమలత రూ.31,544, గణపం రామలింగారెడ్డి రూ.38,795, తడికమండ్ల వెంకటేశ్వర్లు రూ.26,434, ఏరువా రామిరెడ్డి రూ.9,000, గోలమారు రంగారెడ్డి (బోడిచెర్ల) రూ.48,376, నారు వెంకటేశ్వరరెడ్డి (తూర్పుపల్లె, గజ్జలకొండ) రూ.43,824, వెరసి రూ.8,12,939ల చెక్కులను అందజేసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.







## చెత్త రిక్షాలు పంపిణీ







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)

స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో బుధవారం ఎంపీడీవో డాక్టర్ పి సుజాత ఆధ్వర్యంలో చెత్త రిక్షాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసి చైర్మన్ కర్ణ తిరుపతమ్మ మాట్లాడుతూ చెత్త రిక్షాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తడి చెత్త పొడి చెత్త లను ఇంటికి వచ్చి వేరువేరుగా స్వీకరిస్తారని తెలిపారు. ఎంపీడీవో డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయితీ లకు గాను 37 చెత్త స్వీకరణ రథాలను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మండవ మురళీమోహన్, అనుమోలు సుధాకర్ బాబు, మోరు బోయిన మాల్యాద్రి, నంది కనుమ బ్రహ్మయ్య, ఉన్నం శ్రీనివాసరావు, పాతూరు కోటయ్య, మాదాల ప్రసాద్, రమణారెడ్డి రాఘవరెడ్డి, ఎర్ర నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# కూలిన వంతెన తక్షణమే స్పందించిన ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు

### గంటల వ్యవధిలోనే ప్రత్యాయ మార్గం ఏర్పాటు

### 10 రోజుల్లో బ్రిడ్జికి మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు



(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, ఏప్రిల్ 29)

మండలంలోని తలార్లపల్లి సమీపంలో వంతెన కూలి రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిన వేళ, ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మెరుపు వేగంతో స్పందించి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించారు. గంటల వ్యవధిలో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఓబనపాలెం వద్ద వంతెన బలహీనపడి కూలిపోవడంతో వినుకొండ నుంచి కొండరాయునిపాలెం వెళ్లే ప్రధాన రహదారి తెగిపోయి అపాపురం, తలార్లపల్లి, అద్దంకి, గొల్లపాలెం, పువ్వాడ, కొత్తపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే జీవీ ఆంజనేయులు ఆర్ అండ్ బి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, ఆర్ అండ్ బి డిఈ మాధవరావు, ఏఈ నవ్య యుద్ధప్రాతిపదికన జెసిబి సహాయంతో సైడ్ డైవర్షన్ రహదారిని గంటల్లోనే ఏర్పాటు చేసి రవాణాను పునరుద్ధరించారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా మారగా, వంతెన మరమ్మత్తు పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల ఇబ్బందులను వెంటనే గుర్తించి పరిష్కారం చూపిన జీవీ ఆంజనేయులు చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సూచనల మేరకు వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్ కూలిన వంతెనను పరిశీలించి, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసే వరకు పర్యవేక్షించారు. కుంట కోటిరెడ్డి, కిష్టం నాగమల్లేశ్వరరావు, బైలడుగు తులసీరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# విజ్ఞానం, సృజనాత్మకతను పెంచేలా వేసవి విజ్ఞాన శిబిరం





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 29)

వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తూ వారికి చదువుపై ఆసక్తిని పెంచేలా పుస్తక పఠనము, సృజనాత్మకతను పెంచేలా కథలు చేప్పటం, శరీరం దృడంగా వుండేలా యోగాలో శిక్షణ నిర్వహించినట్లు గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహాచార్యులు తెలిపారు. బుధవారం చిన్నగంజాం శాఖా గ్రంధాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శిక్షణ తరగతులకు 21మంది హాజరవ్వగా వారికి రిసోర్స్‌పర్సన్స్‌గా వై రామాంజనేయులు క్లాసులు నిర్వహించారు. విద్యార్థులకు ఇంగ్లీషు స్పెల్లింగ్స్ ని ఆంగ్ల ఉపాధ్యాయులు ఆర్ఎస్‌విబి రాజు విద్యార్థులచే చెప్పించారు. అనంతరం పి శ్రీనివాసరావు విద్యార్థులకు ఊహాశక్తి పెంచేలా కథలు చెప్పటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహాచార్యులు, రిసోర్స్ పర్సన్స్ వై రామాంజనేయులు, ఆర్ఎస్‌విబి రాజు, పి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీర్జాపేట గ్రామంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పశువుల బల ప్రదర్శన పోటీలు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 29)

మండలంలోని మీర్జాపేట గ్రామంలో వేంచేసి యున్న శ్రీ పట్టాభి సీతారామ స్వాముల వారి శతాబ్ది కళ్యాణ మహోత్సవ సందర్భంగా మే నెల 3, 4 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఒంగోలు జాతి పశువుల బలప్రదర్శన పోటీలు (బండలాగుడు పోటీలు) నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మొదటి సైజు విభాగానికి మొదటి బహుమతిగా రూ.80వేలను దాత స్వర్గీయ దేవిరెడ్డి వెంకటరెడ్డి కుమారులు, రెండో బహుమతి రూ.60వేలు దాత పొనిగేటి లక్ష్మిరెడ్డి కుమారులు, 3వ బహుమతి రూ.40 వేలు దేవస్థానం, 4వ బహుమతి రూ.30 వేలు స్వర్గీయ కుందురు వెంకటరెడ్డి కుమారులు, 5వ బహుమతి రూ.20వేలు దాత గొలమారి బ్రదర్స్ విజేతలకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఇందులో పాల్గొనదలచిన వారు 3వ తేదీ సోమవారం తెల్లవారుజామున 5:30లోపు కమిటీ వారికి రూ.600 డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే 4వ తేదీన నిర్వహించ బోయే రెండవ విభాగం అనగా పాల పండ్ల సైజ్ (ఆరు పండ్ల విభాగం) ఎడ్ల పోటీలకు మొదటి బహుమతి రూ.60 వేలు దాత స్వర్గీయ కూచిపూడి రామలింగయ్య కుమారులు, 2వ బహుమతి రూ.40వేలు దాతలు శ్రీ కృష్ణయాదవ సంఘం, 3వ బహుమతి రూ.30వేలు దాత స్వర్గీయ కూచిపూడి వెంకటసుబ్బయ్య కుమారులు, 4వ బహుమతి రూ.20వేలు దాత దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, 5వ బహుమతి రూ.10 వేలు దాత రెడ్డెం పుల్లారెడ్డి కుమారులు. ఇందులో పాల్గొన దలచిన ఎడ్ల యజమానులు 4వ తేదీ తెల్లవారుజామున 5.30 లోపు రూ.400లు డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ వారు తెలిపారు. తుది నిర్ణయం కమిటీ వారిది. ఉచితభోజన వసతులు కలవు. పోనిగేటి వెంకట రమణారెడ్డి 9951143384, ఎర్రగొర్ల బాల గురవయ్య 8184805548, వట్టి రామచంద్రారెడ్డి 9885474708 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# నిబంధనలు అతిక్రమిస్తే జైలుకే ఎస్ఐ సూరెడ్డి రాజేష్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 29)

రోడ్డు నిబంధనల ఉల్లంఘనదారుల పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారి విషయంలో ఇకపై ఎలాంటి మినహాయింపులు ఉండవని, దొరికితే నేరుగా జైలుకు పంపుతామని ఎస్ఐ సూరెడ్డి రాజేష్ ఘాటుగా హెచ్చరించారు. బుధవారం స్థానిక పెద్ద బస్టాండ్‌లో వాహన తనిఖీల్లో భాగంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. కేవలం జరిమానాతో వదిలిపెట్టే రోజులు పోయాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే కౌన్సెలింగ్‌తో పాటు నేరుగా రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, లేని పక్షంలో జరిమానాలు తప్పవన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# పుట్టంరాజు విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంవిఎస్ శాస్త్రి ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)
పుట్టంరాజు బుల్లెయ్య రామ లక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారానికి 2026 సంవత్సరానికి సంబంధించి ప్రముఖ సాహిత్య వేత్త బహు గ్రంథ రచయిత ఎంవిఎస్ శాస్త్రిని ఎంపిక చేసినట్లు పురస్కార ప్రదాత పుట్టం రాజు శ్రీరామచంద్ర మూర్తి వెల్లడించారు. మే 6వ తేదీ ఉదయం 10 గంటలకు అద్దంకిలో ఏర్పాటయ్యే కార్యక్రమంలో ఎం వి ఎస్ శాస్త్రికి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రకాశం జిల్లా పేరాలకు (చీరాల) చెందిన ఎంవిఎస్ శాస్త్రి ద్వానా శాస్త్రి భాషా సాహిత్య సేవ అనే అంశంపై ఎంఫిల్ చేశారు. తుమ్మల కవిత్వం గాంధీ తత్వం అనే అంశంపై పరిశోధన చేస్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా తెలుగు భాషా బోధనా రంగంలో ఉన్న ఎం. వి ఎస్ శాస్త్రి ఎంతో మంది విద్యార్థులను సాహిత్య పిపాస కలిగిన వారిగా తీర్చిదిద్దారు. నవతకు ఆహ్వానం ప్రతిభకు ప్రోత్సాహం పేరిట 1996 నవంబర్ 17న ఒంగోలు కేంద్రంగా అక్షర సాహితీ సమితి అనే సంస్థను స్థాపించి వందకు పైగా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లెటూర్లకు గ్రామాలకు సైతం సాహిత్య కార్యక్రమాలను శాస్త్రి విస్తరించారు .తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ పక్షాన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నారు . టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో ధర్మాచార్య శిక్షణ కార్యక్రమంలో శాస్త్రి పాల్గొన్నారు. శాస్త్రి రచించిన పలు వ్యాసాలు కవితలు గేయాలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. మార్కాపురం విజయవాడ విశాఖపట్నం రేడియో కేంద్రాల నుండి ఎంవిఎస్ శాస్త్రి ఉపన్యాసాలు కవితలు ప్రసారమయ్యాయి. మార్కాపురం రేడియో కేంద్రం నిర్వాహకులు గాంధీ దర్శనం పేరిట శాస్త్రితో ఇంటర్వ్యూ నిర్వహించి 12 భాగాలుగా ప్రసారం చేశారు. ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ, సత్య అ హింసల మహర్షి మహాత్మా గాంధీ, స్వచ్ఛభారత్, అద్భుతాల నిలయం అండమాన్ నికోబార్ దీవులు శ్రీ శ్రీ సమకాలీనత, మహా భారతంలో మహిత భావనలు అనే పుస్తకాలను శాస్త్రి రచించారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పలు సాహిత్య సంస్థల కళా సంస్థల కార్యక్రమాలకు శాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రముఖ జానపద చారిత్రక పరిశోధకులు జ్యోతి చంద్రమౌళితో కలిసి జిల్లాలోని పలు ఆలయాలను పురావస్తు ప్రదేశాలను చారిత్రక ప్రాముఖ్యత ఉన్న కట్టడాలను సందర్శించి విలువైన విషయాలను పత్రికలలో వ్యాసాల ద్వారా తెలియచెప్పారు. పాఠశాలల విద్యార్థులకు సుమతి శతకం వేమన శతకం వంటి పలు శతకాలపై శిక్షణ ఇస్తున్నారు. 1999లో లక్నోలో జరిగిన ఐదవ జాతీయ యువజన సమ్మేళనంలో శాస్త్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధిగా పోటీ ద్వారా ఎంపికై పాల్గొన్నారు, జిల్లా అధికార యంత్రాంగం ఉత్తమ యువ సాహిత్యవేత్త అవార్డుతో శాస్త్రిని సత్కరించింది. పలు సంస్థలు శాస్త్రి సాహిత్య కృషిని గుర్తించి ఘనంగా సత్కరించాయి. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారానికి తనను ఎంపిక చేయడం పట్ల శాస్త్రి సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 29)
మండలంలోని చల్లారెడ్డి పాలెం గ్రామంలో వీధిలైట్లను అమర్చారు. ఈ ప్రక్రియను టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు, యువ నాయకులు కీర్తి పూర్ణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. సీసీ రోడ్లు, సైడ్ కాలువలు మెరుగులు దిద్దుకోవటంతో పాటు ఇంటింటికి నీటి కొళాయిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, అమర్నాథ్ ల సహకారంతో గ్రామాలలో అభివృద్ధి పరిగెడుతుందని కీర్తిపూర్ణ చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, రోడ్లకు కనీసం తట్ట మట్టి కూడా వేయలేదని కీర్తి పూర్ణ విమర్శించారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే కొండయ్య సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

## గ్రంధాలయంలో రెండో రోజు వేసవి విజ్ఞాన తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 29)
ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో రెండవ రోజు వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు,జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులకు ఫ్రూటీ, మ్యాంగోజ్యూస్ డ్రింక్స్ దాత, రామకృష్ణాపురం టీచర్ ఊటుకూరి భాస్కరరాజా అందించి పిల్లల ప్రేమకు, గ్రంథ పాలకుని ప్రేమకు పాత్రులైనారు. ఈ కార్యక్రమానికి మొత్తం 41మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## నారా లోకేష్‌కు అభినందనలు తెలిపిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)
మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జాతీయ, రాష్ట్ర కార్యవర్గాల ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులతో కలిసి టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ ప్రమాణస్వీకారం చేసి భాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను కలిసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ

### బిజెపి నాయకులకు పుష్ప గుచ్ఛంతో ఆహ్వానం పలికిన మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 29)
కడప స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా బుధవారం రాజకీయ సందడి నెలకొంది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాయకులు నాగేంద్ర పలువురు రాష్ట్ర స్థాయి బీజేపీ అగ్ర నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డిలను కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ బద్వేల్ తాలూకా రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించాలని సుప్రజకు సూచించారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. బద్వేల్ ప్రాంత అభివృద్ధికి, రైతాంగ సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు హత్య ప్రజాస్వామ్యానికి అవమానం

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 29)
జర్నలిస్టు హత్య ప్రజాస్వామ్యానికి అవమానకరమని ఆవాజ్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ కార్యాలయం నందు ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన చైర్మన్ గురుమూర్తి ,మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, వీ కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని కిరాతకంగా హత్య చేయడానికి ఖండించారు హతకుడు తమిమే, అతని అనుచరులను కఠినంగా శిక్షించాలని అన్నారు. హతకుడు తమీం అతనిపై రౌడీ షీటర్, 30 ఎర్రచందనం కేసులు ఉన్నాయని, అతడిని ఊరి నుంచి కూడా బహిష్కరణ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి దుర్మార్గుల అక్రమాలను ఎత్తిచూపే జర్నలిస్టుల పై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. మాఫియా శక్తుల ఆగడాలకు బలైపోయిన జగన్మోహన్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ అబ్దుల్‌సత్తార్, ఎస్ అన్వర్‌భాష, ఆవాజ్ నాయకులు కేబి రసూల్, మహమ్మద్ అలీ, బాబయ్య, అల్లా బకాష్, భాష, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో మురుగు నీటి సమస్య పరిష్కరించాలి అస్తవ్యస్తంగా డ్రైనేజ్ సమస్య

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)
మండల పరిధిలోని పలు గ్రామాలలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగు నీటి కాలువలలో నీరు పారలేక అక్కడే నిలిచి రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త సింగర బొట్లపాలెం మురుగునీటి కాలవలు పిచ్చి మొక్కలతో పూడికపోయాయి, కె. అగ్రహారంలో కాలువలలో మట్టి అడ్డు ఉండటం వల్ల మురుగు నీరు ఎక్కడకక్కడే నిలిచిపోయింది. మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల ఉత్పత్తితో అల్లాడుపోతున్నామని, రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలుపుతున్నారు. దోమలతో విష జ్వరాల భారీన పడే ప్రమాదం ఉందని భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మండల అధికారులు మాత్రం తమ కార్యాలకే పరిమితిమయ్యారని ప్రజల మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలు రోగాల బారిన పడకుండా పరిశుభ్రం చేయాలని ప్రతి శనివారం స్వచ్ఛతే సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యంగా పారిశుధ్యం పై చర్యలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తుంది. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది. ఈ నిధులతో గ్రామాలలో పారిశుధ్యం పనులు చేపట్టాలి అయితే గ్రామాలలో అపరిశుభ్రత ఉండటంతో నిధులు ఏమయ్యాయి అని పలు గ్రామాలలో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోని డ్రైనేజీలో మురుగునీరు సమస్య లేకుండా చూడాలని మండలంలోని ప్రజలు తెలుపుతున్నారు.







# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 29)

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన మంత్రి నారా లోకేష్‌కు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో లోకేష్ విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 'కార్యకర్తే అధినేత' అనే నినాదంతో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. యువగళంతో ప్రారంభమైన ప్రయాణం నవగళంగా విస్తరించి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యకర్తలను సైనికులుగా తీర్చిదిద్దిన నాయకత్వం లోకేష్‌దేనని అభిప్రాయపడ్డారు. మహిళలు, యువతకు పార్టీలో ప్రాధాన్యం కల్పిస్తూ యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న పార్టీ విలువలను అదే దిశలో ముందుకు తీసుకెళ్తున్న యువ నాయకుడిగా లోకేష్ నిలిచారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తున్నారని, తెలుగు జాతి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ నిలుస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్‌కు కూడా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు.

# ఏబిఎన్ జర్నలిస్ట్ జగన్మోహన్‌రెడ్డి హత్యకు నిరసనగా పొదిలిలో జర్నలిస్టుల ర్యాలీ

## జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ నినాదాలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 29)

చిత్తూరు జిల్లా వి కోటలో మంగళవారం జరిగిన ఏబీఎన్ జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు నిరసనగా పొదిలి పట్టణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సంయుక్తంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఒంగోలు-నంద్యాల ప్రధాన రహదారిపై విశ్వనాధపురం నుండి పోలీస్ సర్కిల్ ఆఫీస్, పెద బస్టాండ్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు సిఐటియు మార్కాపురం జిల్లా ఉపాధ్యక్షులు నర్రా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న మీడియాపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాలను ప్రజలకు తెలియజేసే కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్న జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం రక్షణకల్పించాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హత్యకు కారకుడైన రౌడీషీటర్లు వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు సర్కిల్ కార్యాలయానికి చేరుకుని పొదిలి సీఐ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్, రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డికి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన శిక్షలు విధించాలని, బాధిత జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండల జర్నలిస్టులు వడ్డే వేణు, ముప్పా వెంకటేశ్వరరెడ్డి, ముల్లా హసన్ వలి (బడే), అహ్మద్, హబీబ్, రామకోటి రెడ్డి, పీవీ కొండయ్య, రమణారెడ్డి, చప్పిడి శీను, ప్రశాంత్, పిచ్చయ్య, శ్రీనివాసులు, పరమేశ్వరరావు, రాధాకృష్ణ, బాజీ, సుబ్బారావు, మందగిరి, తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

## డిఈఓ కు వినతి పత్రం అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి సివి రేణుక కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల స్పెషల్ ఎడ్యుకేషన్ ఎన్‌ఓసీలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బిఈడి కోర్సులు చేసిన ఉపాధ్యాయ సమస్యల మీద చర్చించామన్నారు. దీనిపై డిఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ సూరె వేణుగోపాల్, పోతంశెట్టి రమాదేవి, ప్రమోషన్ డేట్‌ను నోషనల్ సీనియార్టీ కింద లెక్కించుటకు త్వరలోనే ప్రొసీడింగ్ ఇస్తామని తెలియజేశారు. ఉపాధ్యాయుల పాస్‌పోర్ట్, వీసా ఎన్ ఓసిలు గురించి అడిగినప్పుడు వెంటనే క్లియర్ చేస్తున్నామని డిఈఓ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి, జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, సహాధ్యక్షుడు వై వెంకట్రావు, జిల్లా కోశాధికారి చిన్న స్వామి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కొప్పోలు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన సెయింట్ ఆన్స్ విద్యార్థి



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 29)

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆల్ ఫ్రెడ్ ఆంథోనీ కేంద్ర ప్రభుత్వ పీఎం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్ సాధించడం కళాశాలకు గర్వకారణమని యాజమాన్యం తెలిపింది. ఈ స్కాలర్‌షిప్ కింద రూ. 1.5 లక్షలు కేంద్ర ప్రభుత్వం అందజేయనుంది. విద్యార్థి సాధనకు కళాశాలలోని ఆధునిక ల్యాబ్ సదుపాయాలు, నిష్ణాతులైన అధ్యాపకుల మార్గదర్శకత ముఖ్య కారణమని ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు పేర్కొన్నారు. ఆల్ ఫ్రెడ్ ఆంథోనీ కూడా కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకుల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించానని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ లక్ష్మణరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

## ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్ళిన జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 29)

మార్కాపురం జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య బుధవారం ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకని కలిసి ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్, టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం అప్డేషన్, సీనియార్టీ లిస్ట్ సవరణ చేయమని కోరడమైనది. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన ఉపాధ్యాయుల పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్ళగా కార్యాలయ సిబ్బందితో వెంటనే చేయించడం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన 10వ తరగతి స్పాట్ వాల్యూయేషన్ సమర్థవంతంగా నిర్వహించినందుకు మేడమ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తరపున తెలియజేయడం జరిగిందని తెలిపారు.

# వైభవంగా చిన్ని నరసింహ కుమార్, తనుశ్రీల వివాహం

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)

నెల్లూరు నగరంలోని ఎంసీఏ కళ్యాణ మండపంలో చిన్ని నరసింహ కుమార్, తనుశ్రీల వివాహ వేడుక కన్నుల పండువగా జరిగింది. ఈ శుభకార్యానికి బద్వేలు, నెల్లూరు నగరంలోని పలువురు రాజకీయ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి సాయికృష్ణ, మునగ పద్మనాభయ్య, తులసి వెంకట శివనారాయణ, సగల రాజ,పత్తి వెంకట నరసింహ, వల్లంకొండు వెంకటరమణ, వల్లంకొండు వీరప్రసాద్, చిన్ని చెంచురత్నం, చంద్రశేఖర్, తిరువెంగళయ్య, చిందుకూరి సుధాకర్ తదితర ప్రముఖులు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులపై అక్షింతలు వేసి దీవించారు. వివాహానికి విచ్చేసిన అతిథులకు చిన్ని శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొని సందడి చేశారు. నూతన దంపతుల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పంచ పరివర్తన పై క్విస్ విద్యార్థులకు అవగాహన ముఖ్య అతిథిగా పాల్గొన్న భయ్యా శ్రీనివాసరావు

## విద్యార్థులకు పంచ పరివర్తన పై ఉపన్యాసం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో పంచపరివర్తనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ లో కళాశాల పర్సనల్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఆర్ ఎస్ ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పంచపరివర్తన్ అంటే ఏంటో విద్యార్థులకు వివరించారు. అవి పాటించడం వల్ల సమాజంలో మార్పు మొదలవుతుందని, అది భవిష్యత్తు తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. భావి భారత పౌరులు విద్యార్థులే అని, మీ నుంచి మార్పు మొదలైతే కచ్చితంగా దేశంలో మార్పు వస్తుందని అన్నారు. అంతేకాకుండా భారత్ విశ్వగురుగా ప్రపంచంలో నిలబడుతుందని ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే క్విస్ కళాశాల లక్ష్యమని, దాంట్లో భాగంగానే యోగ, పర్సనల్ డెవలప్మెంట్ తదితర అంశాలను ప్రవేశపెట్టినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. ఈకార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి హనుమంతరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని క్విస్ కళాశాల పర్సనల్ డెవలప్ మెంట్ సెల్ హెడ్ మోహన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మొదటి ఏడాది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని పంచ పరివర్తన్ గురించి తెలుసుకున్నారు.



# కార్డన్ సెర్చ్‌లో 30 బైకులు, 4 ఆటోలు స్వాధీనం



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 29)
చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్ పర్యవేక్షణలో బుధవారం చల్లారెడ్డిపాలెం జబ్బర్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సుధాకర్ యాదవ్ నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో వాహనాల పత్రాలు పరిశీలించగా సరైన ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తులు, అద్దెదారుల వివరాలను సవివరంగా తనిఖీ చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమని డీఎస్పీ మోయిన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్ధన్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీజీఎఫ్ పథకం ద్వారా ఆలయాల నిర్మాణం, అభివృద్ధి మంత్రి గొట్టిపాటి రవి కుమార్





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 29)
అద్దంకి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలో భాగంగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరులో నిర్వహించిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) పథకం ద్వారా దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సుమారు రూ.98 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి అడవిపాలెం గ్రామంలో శ్రీ గంగా పార్వతీ సమేత అమర లింగేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టు జగన్ మోహన్‌రెడ్డి హత్యకు నిరసనగా

# ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
### జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి
### ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వి రమణ డిమాండ్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 29)
చిత్తూరు జిల్లా వి కోట మండలంలో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్‌రెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లు, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ, లోక్ సత్తా తదితర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ నుండి ఎస్పీ కార్యాలయం వరకు భారీగా ర్యాలీగా వెళ్లిన నిరసనకారులు, అనంతరం డీఎస్పీ డాక్టర్ యు నాగరాజు కు వినతిపత్రం అందజేశారు. "జర్నలిస్టులపై దాడులు ఆపాలి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి రమణ మాట్లాడుతూ జర్నలిస్ట్ జగన్ మోహన్ రెడ్డిని అత్యంత కిరాతకంగా, అనాగరికంగా హత్య చేయడం దుర్మార్గమైన చర్యని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియాపై ఇలాంటి దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు రక్షణ కొరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకోనిరావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా



అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ ఈ ఘటన రాష్ట్రంలో చట్టవ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు కలిగిస్తోందన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు అందే నాసరయ్య మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరి రెడ్డి, జిల్లా కోశాధికారి డి బాబీ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు షేక్ బాజీవలి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొండపాటి మోహన్ రెడ్డి ,ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు ఎస్ కె మహబూబ్ సుభాని (భాష), షేక్ అన్ను, సిపిఎం నాయకులు డిఎం రఫీ, సిపిఐ కార్యదర్శి షేక్ ఖాసిం, కాంగ్రెస్ నాయకులు మహబూబ్ బాషా, పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల అత్యవసర వైద్యానికి ఏలూరి అండ

# సీఎంఆర్ఎఫ్‌తో అత్యవసర సహాయం



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఏప్రిల్ 29)
పర్చూరు నియోజకవర్గంలో పేదల అత్యవసర వైద్యానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిధులు మంజూరు చేయించి వైద్యం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనంతవరం గ్రామానికి చెందిన తిరుపతి ధనలక్ష్మి బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. పెద్దకాకానిలోని కిమ్స్ చక్ర క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స సూచించగా, ముఠా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న భర్తకు ఖర్చులు భరించడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించగా, వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా గ్రాంట్ కింద రూ.6 లక్షలు మంజూరు చేయించి చెక్కును అందజేశారు. కారంచేడు గ్రామానికి చెందిన రెండున్నర ఏళ్ల చిన్నారి కారంచేటి బాలశ్రీ అజ్ఞా పుట్టుకతో గుండె సమస్యతో బాధపడుతోంది. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండెలో రంధ్రం ఉందని, శస్త్రచికిత్స అవసరమని సూచించారు. పాప తండ్రి స్థానికంగా సాయిబాబా ఆలయంలో పురోహితుడిగా పని చేస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి రూ.3 లక్షలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. మార్టూరు గ్రామానికి చెందిన 14 ఏళ్ల ఉప్పు లక్ష్మీమణికంఠ గ్రానైట్ పనిలో ప్రమాదానికి గురై కాలి ఎముక విరిగింది. చికిత్స కోసం నిధులు లేని పరిస్థితిలో కుటుంబం ఎమ్మెల్యేను ఆశ్రయించగా, ఆయన రూ.71,409ను సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించి చెక్కు అందించారు. జాగర్లమూడి గ్రామానికి చెందిన 67 ఏళ్ల తమ్మిలూరి పుష్పరాజు యూరిన్ లీకేజీ సమస్యతో బాధపడుతూ చిలకలూరిపేటలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స ఖర్చులకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే జోక్యంతో రూ.49,924 సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. పేదలకు అత్యవసర వైద్యం అందించడంలో ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.



# అమరలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, ఏప్రిల్ 29)
సంతమాగులూరు మండలం అడవిపాలెం గ్రామంలో శ్రీ గంగా పార్వతీ సమేత అమర లింగేశ్వర స్వామి వారి నూతన దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గొట్టిపాటి రవికుమార్ ను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com